క్లుప్తంగా

విలేజ్ క్లినిక్‌కు శానిటైజర్లు, మాస్కులు అందజేత



గుంటూరు రూరల్: జొన్నలగడ్డ గ్రామ విలేజ్ హెల్త్ క్లినిక్‌కు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వంగా నవీన్‌రెడ్డి 500లు లెక్కన శానిటైజర్లు, మాస్కులు, గ్లౌవ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివాచారి మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు వ్యక్తిగత , పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. చల్లని పదార్థాలను తగ్గించి వేడిగా తీసుకోవాలన్నారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డి.జీవనజ్యోతి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ



చేబ్రోలు: గొడవర్రు, చేబ్రోలు గ్రామాల్లోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను ఉర్దూ ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసీం గురువారం సందర్శించారు. గొడవర్రులోని పాఠశాలలో విద్యార్థుల ప్రగతి పత్రాలు, ఎఫ్ఏ–1 మార్కులను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పరీక్షల్లో అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. చేబ్రోలులోని పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తనిఖీ చేశారు. పాఠశాలకు హాజరైన విద్యార్థులందరూ భోజనం చేయటం పట్ల హెచ్ఎం, ఉపాధ్యాయులను అభినందించారు.

నామినేషన్‌ల ప్రక్రియ పూర్తి

గుంటూరు రూరల్: చల్లావారిపాలెం గ్రామ పంచాయతీ 5వ వార్డుకు, ఓబులునాయుడుపాలెం 8వ వార్డుకు నామినేషన్‌ల స్వీకరణ పూర్తయిందని ఎన్నికల అధికారి రమేష్ గురువారం తెలిపారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ చేపట్టగా చల్లావారిపాలెంలో 5వ వార్డుకు చల్లా వెంకటరెడ్డి, ఓబులునాయుడుపాలెంలో 8వ వార్డుకు పొత్తూరు విక్టోరియాలు నామినేషన్లు దాఖలు చేశారన్నారు. ఒకొక చోట ఒకొక్కరు మాత్రమే నామినేషన్లు అందజేసినట్లు సమాచారం.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీ సీజ్

తాడికొండ: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని ఎస్ఈబీ అధికారులు సీజ్‌చేసి తమకు అప్పగించినట్లు తాడికొండ సీఐ జి. శ్రీనివాసరావు తెలిపారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం నుంచి వస్తున్న లారీని ఆపి తాడికొండ అడ్డరోడ్డులో తనిఖీలు నిర్వహించగా ఎలాంటి బిల్లులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారన్నారు. కేసు నమోదు చేసిన ఎస్ఈబీ అధికారులు తమకు లారీని అప్పగించినట్లు సీఐ తెలిపారు.

రేపు తెనాలిలో భారత్ బచావో జిల్లా మహాసభ

తెనాలి అర్బన్: భారత్ బచావో సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న తెనాలిలోని ఎన్‌జీవో కల్యాణ మండపంలో జిల్లా మహాసభల్ని నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ భారత్ బచావో స్టేట్ కౌన్సిల్ మెంబర్ అందె శ్యామ్ పేర్కొన్నారు. తెనాలిలో గురువారం మహాసభల కరపత్రాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 9.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రామ్‌దేవ్, ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషా, భారత్ బచావో జాతీయ వైస్ చైర్మన్ డాక్టర్ ఎం.ఎఫ్. గోపీనాథ్, కె.పావని, జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొంటారని చెప్పారు. పట్టణ ప్రజలంతా పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అమనుల్లాఖాన్, షేక్ సుభాని, మహ్మద్ అల్లావుద్దీన్, సయ్యద్ షబ్బీర్, లోకం భాస్కరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ట్రయల్ రన్

తెనాలి: క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా 1942 ఆగస్టు 12న జరిగిన పోరాటంలో అసువులు బాసిన తెనాలి అమరవీరుల సంస్మరణార్థం ఏటా ఆ రోజున తెనాలిలో జరిగే వీర సంస్మరణ దినోత్సవానికి రిహార్సల్స్‌గా గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. స్థానిక రణరంగచౌక్‌లో ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ ఆధ్వర్యంలో జరిగిన ట్రయల్ రన్‌లో 22వ ఆంధ్రాబెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లు, వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజీ, అంబేడ్కర్ కాలేజీ, రావి సాంబయ్య, ఎన్‌సీఆర్ఎం, ఎస్ఎస్ఎస్ఎం ఉన్నత పాఠశాలలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు మొత్తం 400 మంది వరకు పాల్గొన్నారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గాంధీచౌక్, మెయిన్ రోడ్డు, మార్కెట్ వంతెన మీదుగా క్విట్ ఇండియా అమరవీరుల స్థూపాలున్న రణరంగచౌక్ వరకు మార్చ్‌ఫాస్ట్ ట్రయల్ రన్ కొనసాగింది. అమరవీరుల స్థూపాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమాన్ని ఎన్‌సీసీ అధికారులు పులి భాస్కర్, పరిశా సర్దార్, స్వామి, సాయిబాబు, విజయసింహ, సామ్యానాయక్ పర్యవేక్షించారు.

‘మన భూమి- మన దేశం



మొక్కలు నాటుతున్న వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి



కళాశాల విద్యార్థులతో తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ప్రిన్సిపల్



మొక్కలు నాటుతున్న కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఉమాశంకర్‌రెడ్డి



తురకపాలెంలో మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ సుబ్బారావు, వైస్ ఎంపీపీ పద్మావతి

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఎ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం నగర శివారులోని లాంఫాం నందున్న విశ్వవిద్యాలయంలో మన భూమి- మనదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడారు. దేశస్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన త్యాగధనులను స్మరించుకోవటం మన పుణ్యమన్నారు. అనంతరం విశ్వవిద్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్ ప్రశాంతి, రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, అసోసియేట్ డీన్ డాక్టర్ చైతన్యకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి

చేబ్రోలు: స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని చేబ్రోలు తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ అన్నారు. చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జరిగిన సమావేశానికి ప్రిన్సిపల్ వి.శ్రీదేవి అధ్యక్షత వహించారు. తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన త్యాగమూర్తుల ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మొదటి సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు 21 రోజుల పరిచయ కార్యక్రమాన్ని తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలి

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని గుంటూరు రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు తెలిపారు. గురువారం మండలంలోని తురకపాలెం గ్రామంలో మన మట్టి - మన దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వాతంత్ర్య అమరవీరుల చిత్రపటాలకు పూల మాలలు వేసి, నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ డబ్బూరి సూర్యప్రకాశరావు, గ్రామ సచివాలయం సిబ్బంది పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. చిన్నపలకలూరు గ్రామంలో ఆజాదీకా అమృత్ మహోత్సవం ముగింపు సందర్భంగా గురువారం జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వీరజవాన్ తీర్థాల సైదులు సతీమణి తీర్థాల వెంకాయమ్మను ఘనంగా శాలువాతో సత్కరించారు. అనంతరం గ్రామంలో సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ జోస్న, వీఆర్వో ప్రసన్నకుమార్, ఎం.వెంకటేశ్వర్లు, శ్రీను, నరేష్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మన మట్టి మనదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించి త్యాగధనుల త్యాగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డాక్టర్ ఎం.సతీష్‌కుమార్, డి.శ్రీనివాసులు, గిరిబాబు, భరత్ కుమార్ తదితరులున్నారు.

ఆర్వీఆర్‌జేసీలో అధ్యాపకులకు శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అధ్యాపకులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: సాంకేతిక విద్యా వ్యవస్థలో వస్తున్న ఆధునిక మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు శిక్షణ పొందటం ఎంతో అవసరమని ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో అధ్యాపకులకు డేటా సైన్స్ అండ్ అనలిటిక్స్‌పై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు అధ్యాపకులు శిక్షణ పొందుతుండటం ద్వారా విద్యార్థులకు సులభతరంగా విద్యాబోధన చేయవచ్చన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం, వరంగల్‌లోని ఎన్ఐటీ కళాశాలలకు చెందిన అనుభవజ్ఞులైన నిపుణులతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ తరగతుల్లో గుంటూరు, కృష్ణ, ప్రకాశం జిల్లాల్లోని వివిధ కళాశాలల అధ్యాపకులు 43 మంది పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ బి.సుబ్రమణ్యం, డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్, ప్రొఫెసర్ పి.రాధాకృష్ణ, కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి నా వంతు కృషి

మాజీ క్రికెటర్ అంబటి రాయుడు



హైస్కూల్లో సరదాగా క్రికెట్ ఆడిన అంబటి రాయుడు

వంగిపురం (ప్రత్తిపాడు): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతుగా కృషి చేయడం జరుగుతుందని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. వంగిపురం గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. తొలుత దళితవాడ సమీపంలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాలనీలో పర్యటించిన అంబటికి స్థానికులు అక్కడి ప్రాథమిక పాఠశాల పరిస్థితిని వివరించారు. శ్రీ రాజ్యలక్ష్మి సమేత వల్లభరాయస్వామి దేవస్థానాన్ని అంబటి సందర్శించారు. ఆలయ అర్చకులు సుదర్శానాచార్యులు శాస్త్రోక్తంగా ఆయనకు స్వాగతం పలికారు. రాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంబటి రాయుడు విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల వసతులు, తరగతి గదులు, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద.. పథకాల అమలు, తీరుతెన్నులను తెలుసుకున్నారు. హెచ్ఎం నాగేశ్వరరావు పాఠశాలలోని క్రీడా పరికరాల కొరత, ఆర్వో ప్లాంట్.. సమస్యలను అంబటి రాయుడు దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులు, స్థానికులు క్రికెట్ ఆడాలని కోరడంతో సరదాగా బ్యాట్ చేతబట్టి, కళ్లు చెదిరే షాట్లు కొట్టారు. ఈ సందర్భంగా రాయుడు మాట్లాడుతూ గ్రామస్తులు తెలిపిన పలు సమస్యలకు తన వంతుగా చేయగలిగినంత సాయం చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు క్రికెటర్ ఆటోగ్రాఫ్ కోసం పోటీపడ్డారు. వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

నారాకోడూరు పాఠశాల తనిఖీ



విద్యార్థుల పాఠ్యాంశ సామర్థ్యాన్ని తెలుసుకుంటున్న ఉప విద్యాశాఖాధికారిణి నిర్మల

చేబ్రోలు: నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తెనాలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారిణి ఎం.నిర్మల గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. హైస్కూల్‌లో జరుగుతున్న నాడు – నేడు పాఠశాల పనులను పరిశీలించారు. జగనన్న విద్యా కానుకను తనిఖీ చేసి, విద్యార్థులందరూ తప్పనిసరిగా యూనిఫామ్‌తో పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. విద్యార్థులకు ఉపకరణాలతో అర్థవంతంగా బోధించాలన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని పేర్కొన్నారు. విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. హెచ్ఎం ఎం.ఏడుకొండలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ

గుంటూరు రూరల్: నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని జొన్నలగడ్డ గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష తెలిపారు. గురువారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి చిన్నారి ఆరోగ్యంగా జీవించాలని నులిపురుగుల నివారణ మాత్రలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జీవనజ్యోతి, హెచ్ఎం రాజేశ్వరి, వంగా నవీన్‌రెడ్డి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

తెనాలి రూరల్: మేత కోసం వెళ్లిన గేదె విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెనాలి మండలం గుడివాడ గ్రామానికి చెందిన బురదగుంట రాంబాబు గేదెలను గ్రామంలోని కొత్తగా ఏర్పాటు చేస్తున్న కాలనీకి తోలుకెళ్లాడు. అక్కడ విద్యుత్ తీగ తెగి ఉండడంతో ఒక గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. దీంతో రాంబాబు విద్యుత్ తీగ తెగి ఉందన్న విషయాన్ని స్థానికులకు అనంతరం విద్యుత్ శాఖ అధికారులకూ తెలిపాడు. పోలీసుల్ని గురువారం ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు.

అవయవ దానంపై ప్రజలకు అవగాహన అవసరం



సీతామహాలక్ష్మికి సన్మానం

మంగళగిరి: అవయవ దానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్, అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు నిర్మలఫార్మసీ కళాశాలలో గురువారం ఈనెల 13వ తేదీన ప్రపంచ అవయవదానం దినోత్సవం నేపథ్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సీతామహాలక్ష్మి మాట్లాడారు. గతంలో శరీరం మాత్రమే దానం చేసేవారని, ప్రస్తుత సమాజంలో అవయవదానానికి కూడా అనేక మంది ముందుకు రావడం అభినందనీయమన్నారు.అవయవ దానంపై సమాజంలో విస్తృత ప్రచారం కల్పించి, ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మరణానంతరం తమ దేహాలను దానం చేసేందుకు అంగీకారం తెలిపిన కృష్ణారావు, పాండు రంగారావు దంపతులతోపాటు పలువురిని ఆమె అభినందించారు. ఒక వ్యక్తి అవయవాలతో 18 మంది వ్యక్తులకు పునర్జన్మ కలిగించే అవకాశం ఉందన్నారు. అవయవ దానాలపై అపోహలను విడనాడి అందరూ ముందుకు వచ్చి సమాజంలోని తోటి వారికి సహాయపడాలని కోరారు. ఫార్మసీ కళాశాల అనాలసిస్ విభాగం, జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మిని సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జి.నిర్మలజ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ రెహ్మాన్, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, ప్రొఫెసర్లు రత్నశ్రీ, పి. దేవి, హెచ్‌వోడీ డాక్టర్ పద్మావతి, ప్రోగ్రాం అధికారి రేకా నరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



పొన్నూరు ఆర్‌టీసీ బస్ డిపో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: పొన్నూరు పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే నిడుబ్రోలులోని వందెకరాల మంచినీటి చెరువును పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య గురువారం పరిశీలించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పరిసర ప్రాంతాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. జంగిల్ క్లియరెన్స్, వాటర్ బెడ్స్, తుప్పు పట్టిన పైపులను తొలగించటం, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి వివరించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పరిశీలించారు. మౌలిక వసతులపై ఆరా తీసి, అవసరమైన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పొన్నూరు ఆర్టీసీ డిపో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎర్రంశెట్టి రామకృష్ణ, సయామ్ బాషా, మున్సిపల్ అధికారులు శ్రీనివాసరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న ఎంఈవో సీహెచ్ రమాదేవి

ప్రత్తిపాడు: విద్యార్థుల ఆరోగ్యంపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ఎంఈవో సీహెచ్ రమాదేవి అన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేశారు. గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మాత్రలను మింగించారు. ఎంఈవో సీహెచ్ రమాదేవి విద్యార్థులతో దగ్గరుండి మాత్రలు మిగించారు. ఆల్బెండజోల్ మాత్రలను మింగడం వల్ల నులిపురుగులను నివారించవచ్చని మండల విద్యాశాఖాధికారి సీహెచ్ రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయాలు, అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేపనూనెతో పచ్చదోమ నివారణ

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలతావాణి



నడింపాలెంలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలతావాణి

ప్రత్తిపాడు: పైర్లను ఆశిస్తున్న పచ్చదోమను నివారించేందుకు రైతులు వేపనూనెను పిచికారీ చేయాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలతావాణి అన్నారు. మండల పరిధిలోని ప్రత్తిపాడు, యనమదల, నడింపాలెం గ్రామాల్లో గురువారం ఏరుకువా కేంద్రం శాస్త్రవేత్తలు క్షేత్ర సందర్శన చేశారు. పత్తి పంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంటను ఆశిస్తున్న చీడపీడలను పరిశీలించారు. రైతుల సందేహాలను నివృత్తి చేసి పలు సూచనలు అందించారు. డాక్టర్ శ్రీలతావాణి మాట్లాడుతూ ప్రస్తుతం బెట్ట పరిస్థితులు నెలకొనడంతో కొన్ని ప్రాంతాల్లో పచ్చదోమ పంటను ఆశిస్తుందన్నారు. నివారణకు ఒక లీటరు వేపనూనెను ఎకరా పంటలో పిచికారీ చేయాలన్నారు. ఇలా పిచికారీ చేయడం వలన రసం పీల్చే పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చని తెలిపారు. ఆర్థిక నష్ట పరిమితిని అనుసరించి పచ్చదోమ నివారణకు 200 లీటర్ల నీటిలో 60 గ్రాములు ఫ్లోనికామైడ్ కలిపి ఎకరాకు లేదా 250 గ్రాముల డైఫెన్థియురాన్‌ను ఎకరాకు పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. డాట్ సెంటర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జి. కిషోర్‌బాబు మాట్లాడుతూ పత్తి పంటలో సమగ్ర ఎరువుల యాజమాన్యం చేపట్టాలని, ఎకరాకు మూడు బస్తాల యూరియా, ఒక బస్తా డీఏపీ, ఒక బస్తా మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వాడాలని చెప్పారు. యూరియాను మూడు భాగాలుగా చేసి మొక్క 20–30 రోజుల సమయంలో ఒకసారి, 60 రోజుల సమయంలో రెండవసారి, 90 రోజుల సమయంలో మూడవ సారి చల్లాలన్నారు. యూరియా వాడిన ప్రతిసారీ 15–20 కిలోల ఎంవోపి తప్పనిసరిగా వాడాలని రైతులకు సూచించారు. వెంట వీఏఏ గోపి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

నిందితుల్లో ఒకరు మైనర్



స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను తెలియజేస్తున్న సీఐ రమేష్‌బాబు

తెనాలి రూరల్: చెడు వ్యసనాలకు అలవాటు పడి బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఒకరు మైనర్ ఉన్నాడు. కేసు వివరాల్ని త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్ బాబు గురువారం సాయంత్రం వెల్లడించారు. గుంటూరు నెహ్రూనగర్‌కు చెందిన వేముల రేణుకారావు అలియాస్ పండు మరో 14 ఏళ్ల బాలుడు స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు ఖర్చులకు డబ్బుల కోసం బైక్‌లను అపహరించడం ఎంచుకున్నారు. ఇద్దరు కలసి తెనాలి బుర్రిపాలెం రోడ్డులో ఉంటున్న బాలుడి అక్క ఇంటికి ఇటీవల వచ్చారు. పినపాడు, చెంచుపేట డొంక రోడ్డు, మోరిస్‌పేటలో మూడు బైక్‌లను అపహరించుకెళ్లారు. బైక్ యజమానులు పోలీసుల్ని ఆశ్రయించగా కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల ఆచూకీ కోసం ప్రయత్నించారు. చివరకు వీరిని గుర్తించి కదలికలపై నిఘా ఉంచారు. స్థానిక జేఎంజే కళాశాల ఎదురు రోడ్డులో ఉన్నారని తెలుసుకుని సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ కె. వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్ల రంజిత్, అంకయ్య అక్కడకు వెళ్లి నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారిచ్చిన సమాచారం మేరకు మూడు వాహనాల్ని స్వాధీనం చేసుకున్నారు.